ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

సోమవారం 8 జనవరి 2024



సమన్వయకర్తలకు సెగ

- ఎస్.కోట, అరకు నియోజకవర్గాల్లో మార్చాల్సిందేనంటూ నేతల పట్టు
- విశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన
- ఉత్తరాంధ్ర సమన్వయకర్త సుబ్బారెడ్డికి వినతిపత్రాలు

- వివరాలు మెయిన్ 11లో

రంగవల్లుల శోభ

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో సందడిగా ముత్యాల ముగ్గుల పోటీ

- నగర పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన నారీమణులు
- అందమైన రంగవల్లులను అద్భుతంగా తీర్చిదిద్దిన మహిళలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆకర్షణీయమైన బహుమతులు



మరిన్ని ఫొటోలు 4లో

టీపీటీ కాలనీలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ. చిత్రంలో ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు



ముగ్గులు వేస్తున్న మహిళలు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సంక్రాంతి పండగను పురస్కరించుకుని "ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ముత్యాల ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తమలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. టీపీటీ కాలనీలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన మహిళలు భారీగా పాల్గొని రంగవల్లులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సంస్కృతి, సంప్రదాయాలను, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముగ్గులతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.

సంక్రాంతి థీమ్‌తో అలరించిన ముగ్గులు

మారుతున్న కాలంతోపాటే అంతరించిపోతున్న సంప్రదాయ సౌరభాలను భవిష్యత్తు తరాలకు అందించే ఉద్దేశంతో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కొన్నేళ్లుగా ముగ్గులు పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం నిర్వహించిన పోటీల్లో అధికశాతం మంది మహిళలు సంక్రాంతి థీమ్‌తోనే విభిన్న రకాల రంగవల్లికలను తీర్చిదిద్దారు. పలువురు మహిళలు ముగ్గుల్లో మామిడి తోరణాలు, ఇళ్ల ముందు పశువుల సందడి, పసుపు రాసిన పూర్ణకుంభం, పాలు పొంగే సిరులు, నవ ధాన్యాలు, ప్రత్యేక పిండి వంటలు, చెరకు గడలు, డూడూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు.. ఇలా పండగ శోభను ఉట్టిపడేలా తీర్చిదిద్దారు.

విజేతలు వీరే...

పోటీల్లో ప్రథమ బహుమతిని పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన ఆర్.ప్రవీణ గెలుచుకున్నారు. రెండో స్థానంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.సంతోషి, మూడో స్థానంలో ఎస్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతానికి చెందిన కె.నాగమణి నిలిచారు. వీరికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అదించారు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆకర్షణీయమైన బహుమతులను అందించడం ద్వారా వారిని ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ యాజమాన్యం ప్రోత్సహించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించారని, ఆసక్తికరంగా పోటీలు సాగాయని పలువురు మహిళలు పేర్కొన్నారు.



ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత ఆర్.ప్రవీణ



ప్రథమ స్థానంలో నిలిచిన ప్రవీణకు బహుమతి అందజేస్తున్న ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్‌వి రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, ప్రకటనల విభాగం ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సర్క్యులేషన్ విభాగం ఇన్‌చార్జి సత్యనారాయణ, ఏబీఎన్ ఇన్‌చార్జి ఆర్‌వై నాయుడు వున్నారు.

మళ్లీ దొడ్డిదారి బదిలీలు

- నగరానికి వచ్చేందుకు తహతహలాడుతున్న టీచర్లు
- రూ.లక్షలు సమర్పించి ఉత్తర్వులు తెచ్చుకుంటున్న వైనం
- కీలక ప్రజాప్రతినిధి సహాయకుడి వసూళ్ల పర్వం
- జిల్లాకు చేరిన బదిలీల జాబితా
- ఖాళీలు లేక విద్యా శాఖ అధికారులు మల్లగుల్లాలు



విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖలో మరోసారి దొడ్డిదారి బదిలీలకు తెరలేచింది. ప్రభుత్వంలో పలుకుబడి, దండిగా పైసలుంటే ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ జరిగిపోతుందనే ధీమాతో పలువురు టీచర్లు విశాఖ వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

విశాఖ నగర పరిసరాల్లో ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్ల ఖాళీలు లేవు. స్కూలు అసిస్టెంట్ పోస్టులు రెండు లేదా మూడు ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యా శాఖ అధికారులు తాజా పరిస్థితిని పాఠశాల విద్యా శాఖకు నివేదించారు. అయినా విశాఖకు రావాలన్న ఆత్రుతతో ఇప్పటికే సుమారు 50 మంది ఉత్తర్వులు తెచ్చుకున్నారని ప్రచారం సాగుతోంది. ఇవి సీల్డ్‌కవర్‌లో జిల్లా విద్యా శాఖకు చేరాయని, డీఈవో వాట్సాప్‌కు కూడా వచ్చాయంటున్నారు. అసలే ఖాళీలు లేని పరిస్థితిలో దొడ్డి దారిన బదిలీ ఆర్డర్లు తెచ్చుకున్న వారిని భర్తీ చేయడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం.

వారికే దిక్కులేదు!

గత ఏడాది జూలై/ఆగస్టులో దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న వారిలో చాలామందికి ఇప్పటికీ పోస్టింగులు లభించలేదు. ప్రస్తుతం అసలు ఖాళీలే లేని స్థితిలో తాజా ఉత్తర్వుల మేరకు భర్తీ ఎలానో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉత్తర్వులు అమలుచేయకుంటే పెద్దల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరులో పదవీ విరమణలు ఉన్నాయి. దొడ్డిదారిన ... మిగతా 6వ పేజీలో

గంజాయికి అడ్డాగా నగరం



ఏటా పెరుగుతున్న కేసులు

- అక్రమ రవాణాకు ట్రాన్సిట్‌హోల్ట్‌గా మారిన విశాఖ
- ఏజెన్సీ నుంచి ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా
- ప్రత్యేక నిఘాతోనే కేసులు పెరిగాయంటున్న పోలీసులు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరం గంజాయి స్మగ్లర్లకు అడ్డాగా మారింది. ఏజెన్సీ నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయిని చేరవేసేందుకు విశాఖను ట్రాన్సిట్ హోల్ట్‌గా మార్చేశారు. రెండేళ్లలో నగరంలో గంజాయి కేసుల సంఖ్య పెరుగుతుండడం పరిస్థితికి అద్దంపడుతోంది. కేసులతో పాటు పట్టుబడుతున్న నిందితుల సంఖ్య, గంజాయి పరిమాణం భారీగా పెరుగుతుండడం దీనికి అద్దంపడుతోంది.

ఏజెన్సీలోని పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, అనంతగిరి మండలాల పరిధిలోని సుమారు 150 గ్రామాల్లో గంజాయి భారీగా సాగవుతోంది. అక్కడ పండిన గంజాయి రాష్ట్రంతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలకు సరఫరా అవుతోంది. దేశవ్యాప్తంగా మెట్రోపాలిటన్ నగరాలతోపాటు చిన్నపాటి నగరాలు, పట్టణాల్లో కూడా గంజాయికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకొచ్చి, విక్రయించేందుకు స్మగ్లర్లు ఆసక్తి చూపుతున్నారు. ఏజెన్సీలో కిలో రూ.200కు కొనే గంజాయిని హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో రూ.2,500 నుంచి రూ.4,500 వరకూ విక్రయిస్తుంటారు. అదే శీలావతి వంటి మేలుజాతి గంజాయి కిలో ఏకంగా రూ.20 వేల వరకూ పలుకుతుంది. ధర ఎంతైనా కొనేందుకు ఎగబడుతుండడంతో స్మగ్లర్లు, వ్యాపారులు కమీషన్ ప్రాతిపదికన కొంతమందిని కొరియర్లుగా నియమించుకుంటున్నారు. వాహనాలను సమకూర్చుకుని వారి ద్వారా ఏజెన్సీ నుంచి గుట్టుగా నగరానికి చేరుస్తున్నారు. ఇందుకోసం ఏజెన్సీ నుంచి నగరం వరకూ దాడిపొడవునా ఉండే పోలీసులు, నిఘా సిబ్బందికి మామూళ్లు ఇచ్చి తమ పనికి అడ్డులేకుండా చూసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్యాకెట్ల రూపంలో రవాణా

ఏజెన్సీ నుంచి గంజాయిని ప్యాకెట్ల రూపంలో... మిగతా 6వ పేజీలో

గత మూడేళ్లలో నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు	నిందితులు	అరెస్టు అయినవాళ్లు	సీజ్‌చేసిన గంజాయి
2021	221	547	512	2,742 కిలోలు
2022	255	737	636	5,866 కిలోలు
2023	230	886	660	4,650 కిలోలు

ఆక్రమణలో గిడిజాల కొండ



గిడిజాల కొండ వాలులో అక్రమంగా నిర్మించిన ఇళ్లు

- ఇప్పటికే పది ఎకరాల్లో ఇళ్ల నిర్మాణం
- సెంటు రూ.3 లక్షల చొప్పున విక్రయం
- స్థానిక వైసీపీ నేతలే సూత్రధారులు
- అధికారులు, నేతలకు భారీగా మామూళ్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని యంత్రాంగం

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):

కొండను ఆక్రమించుకుని యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయి. గతంలోనే కొందరు కొండ వాలును ఆక్రమించుకుని తోటల పెంపకం చేపట్టారు. జాతీయ రహదారికి ఐదారు కిలోమీటర్ల దూరంలో సింహాచలం, విజయనగరం రోడ్డుకు చేరువగా ఉండడంతో ఇక్కడి స్థలానికి గిరాకీ ఏర్పడింది. దీంతో అధికార పార్టీకి చెందిన వారిగా చెప్పుకునే స్థానికులు కొండవాలులో లే అవుట్‌లు వేసి మరీ విక్రయాలు సాగిస్తున్నారు.

ఆనందపురం మండలం గిడిజాలలో ఉన్న కొండ అక్రమార్కుల పరమవుతోంది. ఇక్కడ ఇప్పటికే సుమారు పది ఎకరాల మేర పరాధీనమైపోయింది. మరికొంత స్థలాన్ని ఆక్రమించిన అక్రమార్కులు లే అవుట్లు వేసి మరీ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగిపోతోంది. ఇక్కడి సమీపంలోనే జగనన్న కాలనీ నిర్మాణం ... మిగతా 6వ పేజీలో



ఎస్మాపై అంగన్‌వాడీల ఆగ్రహం

ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జీవో ప్రతులను దహనం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. - వివరాలు 6లో

కిక్కిరిసిన జగదాంబ జంక్షన్



సంక్రాంతికి వారం రోజులు ముందే మార్కెట్లకు పండుగశోభ వచ్చేసింది. వస్త్ర దుకాణాలకు నిలయమైన జగదాంబ జంక్షన్ ఆదివారం జనసంద్రంగా మారింది. వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతో ట్రాఫిక్‌జామ్ నెలకొంది. మరో వారం రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని పోలీసులు పేర్కొంటున్నారు. - విశాఖపట్నం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఫిబ్రవరిలో ఫిల్మ్ ఫెస్టివల్

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశంలో తీర్మానం

సీతమ్మధార, జనవరి 7: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఎల్‌బీ కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో వార్షిక సర్వ సభ్య సమావేశాన్ని ఆచార్య ఎస్‌ఏడీ పాల్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శి నరవ ప్రకాశరావు నివేదిక సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కమర్షియల్ సినిమాలు కాకుండా సమాంతర సినిమాలు ప్రదర్శించాలనే ఉద్దేశంతో ఏర్పడిన సొసైటీ ఆ దిశగా పయనించడం వల్లే ఇరవై ఏళ్లుగా మనుగడ సాగిస్తుందన్నారు. ఫిబ్రవరి ఆరున తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఫిల్మ్ ఫెస్టివల్ జరపాలని, దీనికి ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ పోసాని కృష్ణమురళీని ఆహ్వానించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, పీకే బోస్, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేరళ కళా సమితి నూతన సంవత్సర వేడుకలు

మాధవధార, జనవరి 7: మురళీనగర్ కేరళ కళా సమితి ఆధ్వర్యంలో క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలను ఆదివారం రాత్రి బిర్లా జంక్షన్‌లోని సమితి భవనంలో ఘనంగా నిర్వహించారు. ఫిల్మ్ క్రిటిక్ మధుసూదన్ ఉన్నితన్ అతిథిగా హాజరయ్యారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన నుంచి కేరళీయులు కుటుంబాలతో సహా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, థింసా నృత్యం అందరినీ ఆకట్టుకున్నాయి. సమితి ప్రతినిధులు ఏఆర్‌జీ ఉన్నితన్, కె.హరిదాస్, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

జగదాంబ కూడలి, జనవరి 7: నగరానికి చెందిన వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఒక హోటల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా డీవీ బాలాజీ కుమార్, కార్యదర్శిగా పీవీ చంద్రశేఖర్, కోశాధికారిగా దుర్గా సోమేశ్వరరావు ఎంపికయ్యారు. వారితో క్లబ్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రవీంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి, క్లబ్ పూర్వ కమిటీ ప్రతినిధులు కె. సత్తిరాజు, మధుసూదన్, గుప్తా, ఎం. రాంజీ, ఆధ్యాత్మిక వేత్త రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

జగదాంబ కూడలి, జనవరి 7: జీవీఎంసీ 30 వార్డులోని లేపాక్షి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తాత్కాలిక పారిశుధ్య కార్మికులు ఆదివారం తొలగించారు. రెగ్యులర్ కార్మికుల సమ్మె వల్ల పలు ప్రాంతాలు, వీధుల్లో చెత్త పేరుకుపోయింది. ఎక్కడికక్కడ రోడ్లన్నీ చెత్తతో నిండిపోయాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు తాత్కాలిక సిబ్బందితో రహదారులు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు : జేసీ విశ్వనాథన్

మహారాణిపేట, జనవరి 7 : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జేసీ విశ్వ నాథన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కమిటీ సభ్యులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 535లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు ఆయన కమిటీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ కన్వీనర్ మణిరామ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 821 దరఖాస్తులు అందాయని, అందులో అమరావతి నుంచి 373, జిల్లాకు చెందినవి 448 దరఖాస్తులు ఉన్నాయన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ నగర పరిధిలోని పలుచోట్ల ఉన్న భూములను గుర్తించాలని తెలిపారు.

ఆర్పీలకు సంక్రాంతి కానుక పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 7: సంక్రాంతి పండగ సందర్భంగా 42, 43, 44 వార్డుల ఆర్పీలకు, సీవోలకు జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు ఆదివారం నందగిరినగర్‌లోని తన కార్యాలయంలో సంక్రాంతి కానుక కింద కుక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్పీలు, సీవోలు నిరంతరం శ్రమిస్తూ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, రమణరాజు, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష

సిరిపురం, జనవరి 7: అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు డిమాండ్ చేశారు. జీవీ ఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన 24 గంటల రిలే దీక్షను ఆదివారం ఆయన ప్రారంభించారు. చరిత్రలో న్యాయం కోసం జరిగిన ప్రతి ఉద్యమం గెలిచిందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎస్మా ప్రయోగిస్తూ తెచ్చిన జీవో నెంబరు 2ను వెనక్కి తీసుకోవాలన్నారు. శిబిరానికి ఐలు రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, పూర్ణిమ, టీడీపీ నాయకుడు లొడగల కృష్ణ, తదితులు హాజరై సంఘీభావం తెలిపారు.

రాజకీయ ప్రాధాన్యం కోసం పోరాడుతాం

ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన్నబాబు

సీతమ్మధార, జనవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేలా పోరాడతామని ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క చిన్నబాబు అన్నారు. వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 48 లక్షల మంది వెలమలున్నందున ఎమ్మెల్యే, ఎంపీ సీట్ల కోసం పోరాడతామని తీర్మానించారు. ఇందులో భాగంగా జనవరి లేదా ఫిబ్రవరి నెలలో రాష్ట్రంలో ఉన్న వెలమ ప్రజాప్రతినిధులు, పెద్దలతో విశాఖలో ఒక సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు అల్లు గౌరునాయుడు, చలుమూరు అప్పల సత్యనారాయణ, ఎర్ర సన్యాసినాయుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నబాబు

ఆరోగ్య సంరక్షణలో సత్వ నేచురల్ కీలకపాత్ర

» మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు



సత్వ నేచురల్ స్టాల్‌ను పరిశీలిస్తున్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు

విశాఖపట్నం, జనవరి 7: ఉత్తరాంధ్ర వాసుల ఆరోగ్య సంరక్షణలో సత్వ నేచురల్ కీలకపాత్ర పోషిస్తోందని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం ఆదివారం పామ్ బీచ్ హోటల్‌లో నిర్వహించిన నేచురల్ లివింగ్ ఎక్స్‌పో సత్వ నేచురల్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ స్టాల్‌లో ప్రదర్శించిన చెక్క వస్తువులు, వరి కంకులు, మట్టి పాత్రలు, భోగి పిడకలు, పచ్చడి బండలు తదితర వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఉత్పత్తులకు విశాఖలో మంచి ఆదరణ ఉందన్నారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సిక్కింలో సేంద్రియ పంటలు బాగా పండిస్తారన్నారు. సేంద్రియ పంటలు వంటింటి వరకు వెళ్లాలని, ఈ వంటలు చేయడంలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. సత్వ నేచురల్ అధినేత మధుసూదనరెడ్డిని ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు అభినందించారు. సందర్శకులు పక్షుల కోసం వరి కంకులు, మట్టితో చేసిన మూకుళ్లు విరివిగా కొనుగోలు చేశారు.

సబ్బం హరి ఆశయాలను ముందుకు తీసుకువెళతా

» జాతీయ మాజీ క్రికెటర్ కమలాకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకరరావు

అక్కయ్యపాలెం, జనవరి 7: దివంగత నేత సబ్బం హరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఆయన ఆశయాలకు ఏ పార్టీ విలువ ఇస్తుందో ఆ పార్టీలో చేరతానని జాతీయ మాజీ క్రికెటర్ జీవీవీఎస్ కమలాకరరావు అన్నారు. డైమండ్‌పార్కు సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల కోసం విశాఖలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. కుల ప్రాతిపదికన కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో మంచి వ్యక్తిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సబ్బం హరి కోరుకున్నట్లుగా విశాఖలో మంచి నాయకత్వాన్ని తీసుకువస్తామని, మరో పది రోజుల్లో ఏ పార్టీలో చేరబోయేది వెల్లడిస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన కూడా ఉందన్నారు. 2014లో తాను జై సమైక్యాంధ్ర పార్టీ నుంచి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ప్రజలెంతో ఆదరించారని పేర్కొన్నారు.

రిక్కీ బుయ్ అజేయ సెంచరీ

» రసవత్తరంగా సాగుతున్న రంజీ క్రికెట్ మ్యాచ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 7: ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బెంగాల్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్ మూడో రోజు ఆటలో ఆంధ్ర మిడిలార్డర్ రిక్కీ బుయ్ అజేయ సెంచరీతో (107 నాటౌట్) అదుకున్నాడు. 109/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర ఆరు వికెట్లకు 339 పరుగులు చేసింది. అశ్విన్ హెబ్బర్ డకౌటై నిరాశపరిచినా కెప్టెన్ హనుమాన్ విహారి అర్ధ సెంచరీతో (51), కె.నితీశ్‌కుమార్ రెడ్డి (30), షోయబ్ మహ్మద్‌ఖాన్ (31) రాణించడంతో బెంగాల్ చేసిన తొలి ఇన్నింగ్స్ స్కోరుపై (409) ఆధిక్యత సాధించే దిశగా వెళుతోంది. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ దీప్, మహ్మద్ కైఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా ఇషాన్, ప్రదిప్త తలో వికెట్ తీశారు. సోమవారం చివరి రోజు ఆట మిగిలున్న నేపథ్యంలో మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలున్నాయి.

బృందావన్ పార్కులో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

మురళీనగర్, జనవరి 7: జీవీఎంసీ 50వ వార్డు పరిధిలోని మురళీనగర్ బృందావన్ పార్కులో ఆదివారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. పార్కు కమిటీ కార్యదర్శి మురళీ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 40 మంది రంగవల్లికలను వేశారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా డాక్టర్ జయంతి వ్యవహరించారు. ప్రథమ బహుమతికి సంతోషిని, ద్వితీయానికి రజని, తృతీయ బహుమతికి సంధ్య ఎంపికయ్యారు. బేబీ లియా వేసిన ముగ్గుకు కన్సొలేషన్ బహుమతి అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పర్వదినాన విజేతలకు బహుమతులు అందజేస్తామని పార్కు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి పతకం, ప్రశంసా పత్రం



పతకం, ప్రశంసా పత్రం అందిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, జనవరి 7: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన తెలుగు మహా సభల్లో 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావుకు పతకం, ప్రశంసాపత్రం లభించింది. ఈ నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరం గైట్ కాలేజీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహా సభల్లో ధర్మారావు పాల్గొని తన ప్రతిభను చూపి పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీ నరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు

సెయింట్ పీటర్స్ పూర్వ విద్యార్థుల 'స్నేహ బంధం'



గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

మురళీనగర్, జనవరి 7: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ స్కూల్ 1986-87 పూర్వ విద్యార్థులంతా ఆదివారం నగరంలోని ఓ హోటల్లో 'స్నేహ బంధం' కార్యక్రమం ద్వారా కలుసుకుని ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల్లో ఒకరైన నగర మాజీ పోలీస్ కమిషనర్ చిరువోలు శ్రీకాంత్ మాట్లాడుతూ సెయింట్ పీటర్స్ స్కూల్ తనకు క్రమశిక్షణను, మంచి మిత్రులను అందించిందన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు విదేశాల్లో స్థిరపడిన వారంతా ఈ కార్యక్రమానికి హాజరై ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ స్వర్ణోత్సవం



సర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సీతమ్మధార, జనవరి 7: ఇక్కడి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ స్వర్ణోత్సవాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ స్కూల్‌లో విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ వేడుకలకు హాజరై సందడి చేశారు. 1987 బ్యాచ్ విద్యార్థులైతే నృత్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా స్కూల్‌కు విచ్చేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు, ఫాదర్‌లు, పాఠశాల సిబ్బందిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు డాక్టర్ ఎన్.మురళీధర్, జయచంద్ర వర్మ, పి.అనిల్‌కుమార్, శ్రీధర్ బిట్ర, పీవీఎస్‌వీ ప్రసాద్, రాఘవ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'



స్థానికులకు కరపత్రాలిస్తున్న గండి బాబ్జీ

డాబాగార్డెన్స్, జనవరి 7 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు పాలనతోనే సాధ్యమని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆదివారం 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలకు చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు సారిపల్లి మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి పణికుమారి, సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఇకియాజ్, బూత్ అధ్యక్షురాలు సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి బంగారు నక్లెస్ బహూకరణ



ఈఓకు ఆభరణాన్ని అందిస్తున్న తుమ్మిడి బ్రదర్స్

జగదాంబ కూడలి, జనవరి 7: కనక మహాలక్ష్మి అమ్మవారికి తుమ్మిడి బ్రదర్స్ రూ. 1.16 లక్షల విలువ చేసే బంగారు నక్లెస్‌ను ఆదివారం బహూకరించారు, జగదంబా జంక్షన్‌లోని తుమ్మిడి బ్రదర్స్ వస్త్ర దుకాణం 15వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆభరణాన్ని అందజేశామని తుమ్మిడి శ్రీనివాస్, రామ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శిరీష, అధికారులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో మియావాకీ స్టోరీ టైమ్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార, జనవరి 7: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా ఆదివారం మియావాకీ స్టోరీ టైమ్‌ను నిర్వహించాయి. ఆర్ట్, క్రాఫ్ట్‌ను రెండు విభాగాలుగా విభజించి మొదటి సెషన్‌లో ఒకటి నుంచి నాలుగో తరగతి విద్యార్థులకు కాగితంతో బొమ్మలను తయారు చేయించారు. రెండో సెషన్‌లో ఐదు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులతో సృజనాత్మకంగా నేమ్ ప్లేట్స్‌ను రూపొందించారు.

విశ్రాంత డీఎస్పీ వెంకటాద్రి మృతి



చాపరాల వెంకటాద్రి (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జనవరి 7: విశ్రాంత డీఎస్‌పీ చారపాల వెంకట్రాద్రి (81) ఆదివారం మృతిచెందాడు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భౌతికకాయాన్ని పిఠాపురం కాలనీలోని స్వగృహానికి చేర్చారు. మంగళవారం అంత్యక్రియలు జరపనున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన వెంకటాద్రి బీకాం చదువుకున్నారు. 1965లో ఎస్ఐగా ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెంలో మొదట బాధ్యతలు చేపట్టి విజయనగరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, పామర్రు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. తరువాత సీఐగా పదోన్నతి పొంది రామచంద్రాపురం, ఏసీపీగా పదోన్నతి పొంది (1992లో) విశాఖ సిటీ ట్రాఫిక్ విభాగంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం లా అండ్ ఆర్డర్, హోమ్ గార్డు విభాగాల్లో పనిచేశారు. 1997 చివరలో హైదరాబాద్ సిటీకి బదిలీ అయ్యారు. 2000లో అక్కడే ఉద్యోగ విరమణ చేశారు.

మళ్లీ దొడ్డిదారి బదిలీలు

... 5వ పేజీ తరువాయి

బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న ఉపాధ్యాయులను ఈ ఖాళీల్లో నియమించాలని యోచిస్తున్నారు. ఇదే అదనుగా ఇక్కడి విద్యా శాఖ సిబ్బందిలో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొమ్ము చేసుకుంటున్న సహాయకుడు

అడ్డగోలు బదిలీలకు ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధి వద్ద ఓ సహాయకుడు చక్రం తిప్పారనే ప్రచారం జరుగుతోంది. బదిలీ కోసం తన వద్దకు వచ్చే టీచర్ల నుంచి ఇతను భారీగానే డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. రైల్వే న్యూకాలనీలో ఉంటున్న ఈ వ్యక్తి ఉత్తరాంధ్రలోని విద్యా శాఖ అధికారులతో నిత్యం టచ్‌లో ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. గత ఏడాది జూన్‌లో టీచర్ల బదిలీలు ముగిసిన తరువాత జూలై, ఆగస్టులో అడ్డదారి బదిలీల పేరిట భారీగా ప్రభుత్వ ఆర్డర్లు తెచ్చిన ఇతను, టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కాగా గత ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి చాలామంది విశాఖ, అనకాపల్లి చుట్టూ ఉన్న పాఠశాలలకు రాగా, అదే సంఖ్యలో నగరం, మైదానంలో పనిచేస్తున్న టీచర్లు ఏజెన్సీకి వెళ్లారు. మన్యంలో పనిచేయడానికి ఇష్టపడని వారు డబ్బులు వెచ్చించి మరీ మైదానంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో నగర పరిసరాల్లోకి వచ్చిన ఏజెన్సీ టీచర్లలో కొందరు ఇక్కడ ఇమడలేక సొంత మండలాలకు వెళ్లేందుకు నిర్ణయించారు. వారిని గుర్తించి, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ నుంచి అనుమతి తెచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లోనే పనిచేయాలన్న ఆలోచనతో మరికొందరు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గత నెలలో గాజువాక, పెందుర్తి మండలాల్లో పనిచేసే ఇద్దరు టీచర్లు పరస్పర బదిలీల పేరిట ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇదే దారిలో మరికొందరు టీచర్లున్నారని, వీరందరికీ కీలక ప్రజా ప్రతినిధి సహాయకుడి నుంచి భరోసా లభించిందనే ప్రచారం సాగుతోంది.

గంజాయికి అడ్డాగా నగరం

... 5వ పేజీ తరువాయి

విశాఖ చేర్చుతున్నారు. నగరంలో ఏదో ఒక చోట నిల్వ ఉంచి, అదను చూసుకుని వాహనాలు, రైలు మార్గంలో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరిగి ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తడంతో గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని పోలీసులపై ఒత్తిడి పెంచారు. దీంతో పోలీసులు గతరెండేళ్లుగా నిఘా పెంచారు. 2021లో 221 గంజాయి రవాణా, విక్రయం కేసులు నమోదుచేయగా 547 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 512 మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఆయా కేసుల్లో 2,742 కిలోలు గంజాయిని సీజ్‌చేశారు. 2022లో గంజాయి రవాణా, విక్రయానికి సంబంధించి 255 కేసులు నమోదుకాగా 737 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 636 మందిని రిమాండ్‌కు పంపించారు. ఆయా కేసుల్లో 5,866 కిలోల గంజాయిని సీజ్ చేశారు. 2023లో 230 కేసులు నమోదుచేయగా 886 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 660 మందిని అరెస్టు చేసి 4,650 కిలోల గంజాయి సీజ్ చేశారు. ఇదిలావుండగా పోలీసులు నమోదుచేసిన కేసులు చాలాస్వల్పమని, వాస్తవంగా నగరం మీదుగా గంజాయి రవాణా జరుగుతున్నదానిలో వీటి సంఖ్య పదిశాతం లోపే ఉంటుందని పోలీసులే పేర్కొంటున్నారు.

తనిఖీలు ముమ్మరం: సీపీ

ఏటా గంజాయి కేసుల సంఖ్య పెరుగుతుండడంపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ వద్ద ప్రస్తావించగా గంజాయి రవాణాపై నిఘా పెంచడంతో కేసుల సంఖ్య పెరుగుతోందన్నారు. పట్టుబడితే కేసు నమోదుచేసి వదిలేయకుండా పూర్తిచైన్‌ను గుర్తించి అందరిపైనా కేసులు నమోదుచేస్తున్నామన్నారు. దీనివల్ల నిందితుల సంఖ్య కూడా పెరుగుతోందని వివరించారు. నగరంలో గంజాయి కట్టడికి కొత్తగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాల తనఖీలను ముమ్మరం చేస్తామన్నారు.

ఆక్రమణలో గిడిజాల కొండ

... 5వ పేజీ తరువాయి

జరుగుతుండడం వీరికి కలిసి వచ్చింది. గతంలో ప్రైవేటు బీమా/చిట్‌ఫండ్ ఏజెంటుగా పనిచేసిన ఓ వ్యక్తి అధికార పార్టీ ముఖ్యనేతల వద్ద పరిచయాలు పెంచుకుని, కొండవాలులో ఆక్రమించిన స్థలాన్ని సెంటు రూ. రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల చొప్పున స్థలాలు విక్రయిస్తున్నట్టు సమాచారం. దీంతో గతంలో ఇక్కడి స్థలాన్ని ఆక్రమించుకున్న వారు, తోటలు పెంచుతున్న వారు కూడా తమ ఆధీనంలోని స్థలాలను ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మేస్తున్నారు. వీరికి ఓ మండల ప్రజాప్రతినిధి తోడయ్యారన్న ఆరోపణలున్నాయి.

జోరుగా ఇళ్ల నిర్మాణం

కొండవాలులో స్థలాలు కొనుగోలుచేసిన వారంతా పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. రెండంతస్తులు, విశాలమైన ఇళ్లను నిర్మాణాలు పూర్తిచేయగా మరికొందరు పునాదులు వేస్తున్నారు. నిర్మాణాల్లో ఇబ్బందులు రాకుండా తహసీల్దారు కార్యాలయం, గ్రామ సచివాలయంలోని సిబ్బందికి, అధికార పార్టీ నేతలకు భారీగా మామూళ్లు అందజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సగటున ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షల చొప్పున మూమూళ్లు అందుతుండడంతో ప్రభుత్వ యంత్రాంగం ఆక్రమణల వైపు కన్నెత్తి చూడడం లేదని చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

నిర్మాణదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము నుంచి గిడిజాలలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు కూడా ఖర్చు చేస్తున్నారని స్థానిక నేతలే చెప్పుకుంటున్నారు. కాగా గిడిజాలలో సుమారు వెయ్యి ఇళ్లకు సంబంధించి జగనన్న కాలనీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దానికి ఆనుకుని ఉన్న కొండను ఆక్రమించుకుని, ఇళ్లు నిర్మిస్తుండడంతో పెద్దగా ఎవరు పట్టించుకోరన్న ధీమాతో ఆక్రమణదారులున్నారు. అయితే అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా సందర్శించి వెళ్లిపోవడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇప్పటివరకు సుమారు రూ. 20 కోట్ల విలువైన కొండ వాలు ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే కొండ కనుమరుగై పెద్దకాలనీ వెలుస్తుందనే వ్యాఖ్యలు వినినిస్తున్నాయి.

గ్రీన్ పార్కులో హ్యాండ్ టూ హ్యాండ్ ఎగ్జిబిషన్



ఎక్స్‌పోలో వివిధ రకాల చీరల ప్రదర్శన

మహారాణిపేట, జనవరి 7: నగరంలోని గ్రీన్ పార్కు హోటల్‌లో సంక్రాంతి పండగ పురస్కరించుకుని హ్యాండ్ టూ హ్యాండ్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ ప్రారంభమయింది. నిర్వాహకులు విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలతో ఎక్స్ పో నిర్వహిస్తున్నారు. ఈనెల 10 వరకు ఈ ఎక్స్‌పో జరగనుంది. ఇందులో మహిళలను ఆకట్టుకునే వివిధ రకాల చీరలు, సల్వార్ టాప్స్, లెనిన్ వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉంచారు. అలాగే ప్రాచీనతను ప్రతిబింబించే పోచంపల్లి కళంకారీ చీరలు, కోల్‌కత్తా బాగల్పురీ ప్రింట్లు, లక్నో షిఫాన్ బనారెస్ సిల్క్ చీరలు, వెంకటగిరి, ఉప్పాడ చీరలు, బెడ్ షీట్లు కూడా అందుబాటులో ఉంచారు.

ఉద్యోగుల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

» మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్

» రాష్ట్రస్థాయి మున్సిపల్ ఉద్యోగుల ప్రథమ మహాసభ



వేదికపై మంత్రులు బొత్స, సురేశ్, అసోసియేషన్ ప్రతినిధులు

సిరిపురం, జనవరి 7: ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగుల పక్షపాతి అని మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మునిసిపల్ ఉద్యోగుల ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 మున్సిపల్ కార్పొరేషన్లలోని అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగమే ఉద్యోగులని, వారి డిమాండ్లు పరిష్కరించేందుకు సబ్ కమిటీ కృషిచేస్తుందన్నారు. మునిసిపల్ విభాగంలో కొన్ని కేటగిరీలైన పారిశుధ్యం, అండర్ గ్రౌండ్ తదితర విభాగాలకు చెందిన అవుట్ సోర్సింగ్ కార్మికులతో పోల్చుకోవద్దని, వారు చేసిన పని ఎంతో గొప్పదన్నారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సుమారు 11 అంశాలను మంత్రులకు చదివి వినిపించారు. ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరావు ఉద్యోగుల ఐక్యతతో హక్కులను సాధించుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ దొప్పలపూడి, ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, వీవీ వామనరావు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి సిరిపురం గురజాడ వరకు ర్యాలీ నిర్వహించారు.

బీసీల సంక్షేమానికి కృషి

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

గాజువాక, జనవరి 7: వెనకబడిన కులాల సంక్షేమానికి జనసేన కృషి చేస్తుందని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. గాజువాకలో ఆదివారం సగర కుల సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థికంగా వెనకబడిన బీసీ-డీ కేటగిరికి చెందిన వాళ్లను బీసీ-ఏలోకి మార్చాలని, ఉప్పరకు బదులు సగర ఇవ్వాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాలను పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా గోవింద్, గుర్రం నాగరాజు, రాంబాబు, సూరి అప్పారావు, చిన్న, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కళ్లద్దాలు అందజేత

మల్కాపురం, జనవరి 7: ఇక్కడి ప్రకాశ్‌నగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్ సేవా సమితి ట్రస్టు, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'పశ్చిమ' ఎమ్మెల్యే పీ.గణబాబు, టీడీపీ నేత శ్రీభరత్‌లు మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పలువురికి నేత్ర పరీక్షలు చేసి కళ్లద్దాలను అందించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 7: గాజువాక నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు యరబాల భూలోక, అప్పారావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందలు

అగనంపూడి, జనవరి 7: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి రియల్ చాంపియన్‌షిప్ అకాడమీకి చెందిన కరాటే క్రీడాకారులు ఇటీవల విశాఖ కెన్యూరాయ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చేతుల మీదగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి దశేంద్ర, సోమశేఖర్, విజయ్, బి.సత్యనారాయణ, సూర్య, నిర్వాహకుడు సుమన్ బాబీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

పెదగంట్యాడ, జనవరి 7: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని లైబ్రరీ నిర్వహణాధికారి పీవీ రమణ నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలు చదవడం పట్ల ఆసక్తిని కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

దామా ఫౌండేషన్ ద్వారా నీటి సరఫరా

కూర్మన్నపాలెం, జనవరి 7: తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మెబాట పట్టడంతో 86వ వార్డు ప్రజలు మంచినీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. కాలనీ వాసుల ఇబ్బందులను వైసీపీ సీఈసీ సభ్యుడు దామా సుబ్బారావు వద్ద పలువురు ప్రస్తావించడంతో ఆయన స్పందించి దామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, జనవరి 7: సింహాద్రి అప్పన్న స్వామిని ఆదివారం జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ భానుప్రకాష్ శ్రీవాస్తవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నిత్యావసర సరకులు పంపిణీ

అగనంపూడి, జనవరి 7: అగనంపూడి సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పలువురు క్షతగ్రాతులు, నిరుపేద కుటుంబాలకు ట్రస్టు ప్రతినిధులు గవర నరసింహారావు, జి.నరసింగరావులు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదపలో ఉన్నవారిని గుర్తించి వారికి అండగా నిలవడమే తమ లక్ష్యమన్నారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 60, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 56, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 20, క్యారెట్ 48, దొండకాయలు 32, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 230, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 20, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24, కంద 54, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	70
ఫారం ధర	--	90
విత్ స్కిన్	--	150
స్కిన్‌లెస్	--	160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 4లో..



గాజువాక కణితి రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం



87వ వార్డు సిద్ధార్థనగర్‌లో తిష్ఠ వేసిన చెత్త

అంటువ్యాధుల భయంతో ప్రజలు బెంబేలు

ఏ వీధిలో చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలే..

భరించరాని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఆవేదన

గాజువాక, జనవరి 7: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టడంతో పారిశుధ్య పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతోంది. వార్డుల్లో ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కుక్కలు, పందులు, పశువులు చెత్తాచెదారాన్ని చిందరవందర చేస్తుండడంతో ఆయా ప్రాంతాల్లోని రహదారులన్నీ అధ్వానంగా మారుతున్నాయి. రోజుల తరబడి చెత్త తిష్ఠ వేయడంతో భరించరాని దుర్వాసన వస్తోంది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇళ్లలోకి వస్తుండడంతో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గాజువాకలో ఏ వీధిలోనైనా, ప్రధాన మార్గంలో అయినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. జోన్ పరిధిలో ఉన్న సుమరు 150 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నా.. వారు ప్రధాన మార్గంతో పాటు కీలక జంక్షన్లలో పేరుకుపోయిన చెత్తను మాత్రమే తొలగిస్తున్నారు. దీనికితోడు తాగునీటి సరఫరా విభాగం కార్మికులు కూడా సమ్మె చేస్తుండటంతో మంచినీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో పలు ప్రాంతాల ప్రజలు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.



శ్రీనగర్‌లో వ్యర్థాలు

కూర్మన్నపాలెం: పారిశుధ్య కార్మికుల సమ్మె ప్రభావంతో 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్, కాళింగుల వీధి, 71వ వార్డు శ్రీనగర్‌లలో పేరుకుపోయిన చెత్తకుప్పలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తంతా రహదారుల పైకి చేరడంతో రాకపోకలు సాగించేందుకు పాదచారుల, వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం ద్వారా చెత్తాచెదారాన్ని తరలించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, జనవరి 7: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల న్యాయ సమ్మతమైన సమస్యలను పరిష్కరించడంతో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పారిశుధ్య కార్మికులు సమ్మెబాటు రోజులు గడుస్తుండడంతో ప్రతి వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి భరించరాని దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, పలువురు రోగాల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా విభాగ కార్మికులు కూడా నిరవధిక సమ్మెకు దిగడంతో మంచినీరందక ప్రజలు నానాపాట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు అనంత్, రట్టి వాసు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

చింతగట్ల జగనన్న కాలనీ అక్రమాలపై కలెక్టర్ దృష్టి సారించాలి: 'బండారు'

పెందుర్తి, జనవరి 7: మండల రెవెన్యూ పరిధిలోని చింతగట్ల జగన్న కాలనీలో ఇళ్ల పట్టాలలో అక్రమాలు, గ్రావెల్ దోపిడీపై కలెక్టర్ దృష్టి సారించాలని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చింతగట్లలో జగనన్న కాలనీని ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి కాలనీలో 130 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్లాట్లు వేసిన లేఅవుట్‌లో స్థానిక వైసీపీ నాయకులు బినామీల పేరిట పట్టాలు సృష్టించి మరో 70 ప్లాట్లను ఆక్రమించి అక్రమ ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారని ఆరోపించారు. కాలనీ నిర్మాణాల మాటున ఇక్కడ గల కొండను గుల్ల చేసి రూ.ఐదు కోట్ల విలువ గల గ్రావెల్ దోపిడీకి పాల్పడ్డారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడి భూ బాగోతానికి అడ్డుకట్ట వేస్తామన్నారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న బండారు, తదితరులు

అలాగే మండలంలోని జెర్రిపోతులపాలెం, ముదపాక, ఎస్ఆర్ పురంలలో భూ సేకరణలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ దృష్టి సారించాలని బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, మాజీ వైస్ ఎంపీపీ మడక పార్వతి, జెర్రిపోతులపాలెం సర్పంచ్ మడక అప్పలరాజు, నాయకులు ఇప్పిలి చిన్నారావు ఉన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే క్రికెట్ పోటీలు

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి

మల్కాపురం, జనవరి 7: పశ్చిమ నియోజకవర్గంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు వైసీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ జగనన్న పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జింక్ మైదానంలో జరిగిన ఫైనల్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో 92వ వార్డుకు చెందిన జీహెచ్ఎస్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకుంది.



విజేతలతో వైవీ సుబ్బారెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు

అదేవిధంగా 61వ వార్డుకు చెందిన కైఐడబ్ల్యూఎస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.లక్ష, 89వ వార్డుకు చెందిన ఎస్ఏడీ లెవెన్స్ జట్టు సభ్యులు తృతీయ స్థానంలో నిలిచి రూ.50 వేలను సొంతం చేసుకున్నారు. విజేతలకు ఎంపీ కృష్ణయ్య, ఆడారి ఆనంద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు మిలీనియం శ్రీధర్‌రెడ్డి, పార్టీ పశ్చిమ పరిశీలకుడు రెహమాన్‌ను చెక్కులు, ట్రోఫీలను అందజేశారు.



మత్స్యకారులు బహూకరించిన వల, బుంగలతో లక్ష్మణ్, పురందేశ్వరి, మాధవ్ తదితరులు

జగన్ బీసీ వ్యతిరేకి

ఓట్ల కోసమే ఉచిత పథకాలు

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్

నగరంలో బీజేపీ బీసీ సామాజిక చైతన్య సభ

ఎంవీపీ కాలనీ, జనవరి 7: రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బీసీలను అణగదొక్కేసారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ విమర్శించారు. ఉత్తరాంధ్ర నుంచి లక్షల మంది తెలంగాణలో ఉపాధి కోసం ఉండేవారని, వారిని బీసీ జాబితా నుంచి కేసీఆర్ తొలగిస్తే, ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఏమి చేశారని ప్రశ్నించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో ఆదివారం సాయంత్రం బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మాత్రమే బీసీలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో తూర్పు కాపు, శిష్టకరణ, కళింగ, కోమటి, అరవ కులాలు తమను కేంద్ర జాబితాలో చేర్చాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా, బీసీ వ్యతిరేక పార్టీలు పట్టించుకోలేదని, త్వరలోనే ఈ కులాలు కేంద్ర జాబితాలో చేరుతాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్ కూడా బీసీలకు వ్యతిరేకి అన్నారు. ఓట్ల కోసం ఉచిత పథకాలు పెట్టారని ఆరోపించారు. ఎన్టీఆర్ పుణ్యమా అని ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, దేవందర్ గౌడ్ వంటివారు ఉన్నత స్థానాల్లో కనిపించారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందీశ్వరి మాట్లాడుతూ బీసీ కులాల అభివృద్ధి కోసం పరితపించే పార్టీ బీజేపీ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇక్కడి బీసీ కమిషన్‌కు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఓబీసీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, నాయకులు పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర, కొత్తపల్లి గీత, గోపి శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, కాశీవిశ్వనాథ రాజు, తదితరులు పాల్గొన్నారు.

గవర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 7: షీలానగర్, వెంకటేశ్వరకాలనీ గవర సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దాసరి పైడిమాంబ ఆలయం వద్ద జరిగిన గవర ఆత్మీయ సమ్మేళనంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షునిగా ఆళ్ల రాంప్రసాద్, అధ్యక్షునిగా పెంటకోట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా మద్దాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా మళ్ల నగేశ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా దొడ్డి సూరిబాబు, కోశాధికారిగా సరగడం రామచంద్రరావు ఎన్నికయ్యారు.

'చిత్రకళలు ఆనందాన్ని ఇస్తాయి'

మల్కాపురం, జనవరి 7: చిత్రకళలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి ఆదివారం విచ్చేసిన ఆయన మాట్లాడుతూ చిత్రకళల్లో ఉత్తరాంధ్రకు మంచిపేరు ఉందన్నారు. ఈ సందర్భంగా చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి పలు ప్రచురణలను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో చిత్రకారులు సీఎస్ఎన్ రాజు, శ్రీనివాస్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

రాజకీయంగా కాపులు అభివృద్ధి చెందాలి

జనసేన పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు

ఆటోనగర్, జనవరి 7: ఆర్థిక, రాజకీయ రంగాలలో కాపులు అభివృద్ధి చెందాలని జనసేన పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఆటోనగర్‌లోని మామిడి తోటలో ఆదివారం కాపుల ఆత్మీక కలయికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో కాపు సంఘాలు ముందుండాలని, హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. కాపు నాయకులు వి.రాజారావు, సీతిని అప్పారావు మాట్లాడుతూ కాపులు ఐక్యంగా ఉండాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, లంకల మురళీదేవి, ఇసాక్, జోజి, పీబీఎల్ మూర్తి, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

పెందుర్తి, జనవరి 7: తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని పలువురు నాయకులు మండిపడ్డారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగింది. ఐదుగురు అంగన్‌వాడీలు నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అధిక సంఖ్యలో దీక్షా శిబిరానికి చేరుకుని జగన్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాత్రి సుమారు 50 మంది అంగన్‌వాడీలు దీక్షా శిబిరం వద్దే నిద్రించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, అధ్యక్షురాలు బృంద, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంతుని నవనీతోత్సవం

పద్మనాభం, జనవరి 7 : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బహుళ ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం నవనీతోత్సవం ఘనంగా నిర్వహించారు. కుంతీమాధవస్వామి మూలవిరాట్టుకు ముందుగా పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం స్వామిని వెన్నతో అలంకరించారు. ముందుగా నగర సంకీర్తన, గోదా, రంగనాధులకు విశేష అర్చనలు చేసి బేడా సేవ, నామ సంకీర్తన నిర్వహించారు. నవనీత అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. అలాగే మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు అనంతుని చిత్రపటాన్ని బహూకరించారు.





మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, తదితరులు

ఉత్సాహభరితంగా 3కే మారథాన్

గాజువాక, జనవరి 7: గుండెను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామాలు చేయాలని పలువురు పేర్కొన్నారు. గాజువాకలో పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 3కే మారథాన్‌ను నిర్వహించారు. గాజువాక యశోద స్కూల్ వద్ద ప్రారంభమైన మారథాన్ పాత గాజువాక, సినిమా హాల్ జంక్షన్, కొత్త గాజువాక వరకు ఉత్సాహభరితంగా సాగి, తిరిగి పాత గాజువాక కూడలికి చేరుకోవడంతో ముగిసింది. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు పల్లా కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులకు టీషర్టులు, టోపీలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై వైభవంగా సుదర్శన హోమం



పూర్ణాహుతిలో పాల్గొన్న శారదా పీఠాధిపతి, తదితరులు

పెందుర్తి, జనవరి 7: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగు తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారికి తిరుప్పావై, గోపూజ చేశారు. అనంతరం సుదర్శన కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై శోభాయమానంగా అలంకరించిన శ్రీనివాసుడు, పద్మావతి, మంగాదేవిల ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి హోమగుండాలను ఏర్పాటు చేశారు. ప్రధాన అర్చకులు మహర్తి రామానాజుచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా 32 మంది దంపతులుచే సుదర్శన హోమం జరిపారు. విశిష్ట అతిథిగా హాజరైన శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి రుత్వికుల మంత్రోచ్ఛారణలు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య సుదర్శన హోమానికి పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తూ వెంకటాద్రి వేంకటేశ్వరుడు సర్వపాపహరుడని అన్నారు. గర్భాలయంలోని శ్రీవారిని శారదా పీఠాధిపతి దర్శించుకున్నాక రుత్వికులు ఘనంగా సత్కరించారు. సుమారు 1,500 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసా దాన్ని స్వీకరించారు. భక్తులకు శ్రీవారి సేవాదళ్ సభ్యులు ప్రశంసనీయమైన సేవలందించారు. భక్తులకు ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవింద్, కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకరరావు, ముమ్మన దేవుడు, దాడి రమణచిట్టి, తదితరులు శ్రీవారిని దర్శించుకోగా, ఆలయ కమిటీ చైర్మన్ ఎం.ఎస్.రాజు, ఈవో నీలిమ పాల్గొన్నారు.

ముగిసిన సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 7: స్టీల్‌ప్లాంట్ సృష్టి స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగిసింది. విద్యార్థులు ప్రదర్శించిన ఆటోమెటిక్ రైల్వే గేటు, వెహికల్ కంట్రోల్ డ్రంక్ అండ్ డ్రైవ్, ఆటోమెటిక్ స్ట్రీట్ లైట్, రోబోట్ ఫుట్ ప్రింట్ పవర్, జేసీబీ వర్కింగ్ విత్ ప్రెజర్ లైవ్ స్కెచ్ వంటి పారజెక్టులతో పాటు వెదురుకర్రలు, గోనె సంచులు, కాటన్ క్లాత్‌లతో రంగులద్దిన యాభై అడుగుల పొడవు గల డ్రాగన్, తదితరమైనవి ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఈడీ మేఘన, డైరెక్టర్ సుశీల రాణి, ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తీపి గురుతుగా తీసుకున్న గ్రూప్ ఫొటో

మల్కాపురం, జనవరి 7: మల్కాపురం మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సాగరదుర్గ అమ్మవారి గుడి వద్ద ఆత్మీయ కలయిక కార్యక్రమం ద్వారా కలుసుకుని ఆనందంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసు కుంటూ, పిల్లల చదువులు, పెళ్లిళ్ల, యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు న్యూ ఇయర్, సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆ తర్వాత గ్రూప్ ఫొటో దిగారు.

ఫిబ్రవరి 4న విప్రోత్సవ మహాసభ

పెందుర్తి, జనవరి 7: రాష్ట్రవ్యాప్తంగా గల బ్రాహ్మణుల రాజకీయ చైతన్యం, ఐక్యత కోసం ఫిబ్రవరి నాలుగో తేదీన నగరంలో విప్రోత్సవం నిర్వహణ మహాసభను నిర్వహించనున్నట్టు ద్రోణంరాజు శ్రీనివాత్సవ పేర్కొన్నారు. సుజాతనగర్‌లోని దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ సామాజిక బ్రాహ్మణ భవన్‌లో ఆదివారం నిర్వమించిన బ్రాహ్మణ బంధు ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి దివంగత ఎంపీ ద్రోణంరాజు సత్యనారాయణ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, నారాయణరావు, నరసింహమూర్తి, చరణ్‌కుమార్, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యం'

అగనంపూడి, జనవరి 7: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజా సంక్షేమం జరుగుతుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెంలో ఆదివారం బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అవినీతి తప్పా అభివృద్ధికి చోటులేకండా పోయిందని విమర్శించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మచ్చా శివకుమార్, నాయకులు కరణం అప్పారావు, డి.అర్జున్, రామకష్ణ, చిన్నారావు, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో 33,286 నేత్ర శస్త్ర చికిత్సలు

వేపగుంట జనవరి 7: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేత్ర వైద్యంలో నాణ్యమైన సేవలందిస్తున్న నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి 2023లో 33,286 నేత్ర చికిత్సలు చేసి అరుదైన ఘనత సాధించిందని ఫౌండేషన్ డీజీఎం కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో 1,40,963 మంది అవుట్ పేషెంట్లకు కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 58 శాతానికి పైగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పరీక్షలు నిర్వహించామన్నారు. గ్లకోమా ఐ స్టంట్ శస్త్రచికిత్సను ప్రప్రథమంగా ఓ వ్యక్తి చేసి రికార్డు సృష్టించినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లతో గాజువాకలో నూతనంగా 20 బెడ్ల ఆస్పత్రిని నిర్మించి పారిశ్రామిక ప్రాంతవాసులకు నేత్ర వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించడానికి వైద్యులు, సిబ్బంది ఎంతో కృషి చేశారన్నారు. భవిష్యత్తులోనూ మరింతగా ఉత్తమ నేత్ర వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఫిబ్రవరిలో ఫిల్మ్ ఫెస్టివల్

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశంలో తీర్మానం

సీతమ్మధార, జనవరి 7: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఎల్బీ కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆచార్య ఎస్ఏడీ పాల్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శి నరవ ప్రకాశరావు నివేదిక సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కమర్షియల్ సినిమాలు కాకుండా సమాంతర సినిమాలు ప్రదర్శించాలనే ఉద్దేశంలో ఏర్పడిన సొసైటీ ఆ దిశగా పయనించడం వల్లే ఇరవై ఏళ్లుగా మనుగడ సాగిస్తుందన్నారు. ఫిబ్రవరి ఆరున తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఫిల్మ్ ఫెస్టివల్ జరపాలని, దీనికి ఫిల్మ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పోసాని కృష్ణమురళీని ఆహ్వానించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, పీకే బోస్, బి.చిన్నారావు, హసన్, చాట్ల బాబూరావు రెడ్డి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేరళ కళా సమితి నూతన సంవత్సర వేడుకలు

మాధవధార, జనవరి 7: మురళీనగర్ కేరళ కళా సమితి ఆధ్వర్యంలో క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలను ఆదివారం రాత్రి బిర్లా జంక్షన్‌లోని సమితి భవనంలో ఘనంగా నిర్వహించారు. ఫిల్మ్ క్రిటిక్ మధుసూదన్ ఉన్నితన్ అతిథిగా హాజరయ్యారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన నుంచి కేరళీయులు కుటుంబాలతో సహా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, థింసా నృత్యం అందరినీ ఆకట్టుకున్నాయి. సమితి ప్రతినిధులు ఏఆర్‌జీ ఉన్నితన్, కె.హరిదాస్, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

జగదాంబ కూడలి, జనవరి 7: నగరానికి చెందిన వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఒక హోటల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా డీవీ బాలాజీ కుమార్, కార్యదర్శిగా పీవీ చంద్రశేఖర్, కోశాధికారిగా దుర్గా సోమేశ్వరరావు ఎంపికయ్యారు. వారితో క్లబ్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రవీంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి, క్లబ్ పూర్వ కమిటీ ప్రతినిధులు కె. సత్తిరాజు, మధుసూదన్, గుప్తా, ఎం. రాంజీ, ఆధ్యాత్మిక వేత్త రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

జగదాంబ కూడలి, జనవరి 7: జీవీఎంసీ 30 వార్డులోని లేపాక్షి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తాత్కాలిక పారిశుధ్య కార్మికులు ఆదివారం తొలగించారు. రెగ్యులర్ కార్మికుల సమ్మె వల్ల పలు ప్రాంతాలు, వీధుల్లో చెత్త పేరుకుపోయింది. ఎక్కడికక్కడ రోడ్లన్నీ చెత్తతో నిండిపోయాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు తాత్కాలిక సిబ్బందితో రహదారులు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు : జేసీ విశ్వనాథన్

మహారాణిపేట, జనవరి 7 : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జేసీ విశ్వ నాథన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం అయన జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కమిటీ సభ్యులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 535లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు ఆయన కమిటీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ కన్వీనర్ మణిరామ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 821 దరఖాస్తులు అందాయని, అందులో అమరావతి నుంచి 373, జిల్లాకు చెందినవి 448 దరఖాస్తులు ఉన్నాయన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ నగర పరిధిలోని పలుచోట్ల ఉన్న భూములను గుర్తించాలని తెలిపారు.

ఆర్పీలకు సంక్రాంతి కానుక పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 7: సంక్రాంతి పండగ సందర్భంగా 42, 43, 44 వార్డుల ఆర్పీలకు, సీవోలకు జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు ఆదివారం నందగిరినగర్‌లోని తన కార్యాలయంలో సంక్రాంతి కానుక కింద కుక్కర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్పీలు, సీవోలు నిరంతరం శ్రమిస్తూ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, రమణరాజు, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష

సిరిపురం, జనవరి 7: అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు డిమాండ్ చేశారు. జీవీ ఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన 24 గంటల రిలే దీక్షను ఆదివారం ఆయన ప్రారంభించారు. చరిత్రలో న్యాయం కోసం జరిగిన ప్రతి ఉద్యమం గెలిచిందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎస్మా ప్రయోగిస్తూ తెచ్చిన జీవో నెంబరు 2ను వెనక్కి తీసుకోవాలన్నారు. శిబిరానికి ఐలు రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, పూర్ణిమ, టీడీపీ నాయకుడు లొడగల కృష్ణ, తదితులు హాజరై సంఘీభావం తెలిపారు.

రాజకీయ ప్రాధాన్యం కోసం పోరాడుతాం

ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన్నబాబు

సీతమ్మధార, జనవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేలా పోరాడతామని ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క చిన్నబాబు అన్నారు. వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 48 లక్షల మంది వెలమలున్నందున ఎమ్మెల్యే, ఎంపీ సీట్ల కోసం పోరాడతామని తీర్మానించారు. ఇందులో భాగంగా జనవరి లేదా ఫిబ్రవరి నెలలో రాష్ట్రంలో ఉన్న వెలమ ప్రజాప్రతినిధులు, పెద్దలతో విశాఖలో ఒక సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు అల్లు గౌరునాయుడు, చలుమూరు అప్పల సత్యనారాయణ, ఎర్ర సన్యాసినాయుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నబాబు

ఆరోగ్య సంరక్షణలో సత్వ నేచురల్ కీలకపాత్ర

» మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు


సత్వ నేచురల్ స్టాల్‌ను పరిశీలిస్తున్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు

విశాఖపట్నం, జనవరి 7: ఉత్తరాంధ్ర వాసుల ఆరోగ్య సంరక్షణలో సత్వ నేచురల్ కీలకపాత్ర పోషిస్తోందని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం ఆదివారం పామ్ బీచ్ హోటల్‌లో నిర్వహించిన నేచురల్ లివింగ్ ఎక్స్‌పో సత్వ నేచురల్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ స్టాల్‌లో ప్రదర్శించిన చెక్క వస్తువులు, వరి కంకులు, మట్టి పాత్రలు, భోగి పిడకలు, పచ్చడి బండలు తదితర వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఉత్పత్తులకు విశాఖలో మంచి ఆదరణ ఉందన్నారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సిక్కింలో సేంద్రియ పంటలు బాగా పండిస్తారన్నారు. సేంద్రియ పంటలు వంటింటి వరకు వెళ్లాలని, ఈ వంటలు చేయడంలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. సత్వ నేచురల్ అధినేత మధుసూధనరెడ్డిని ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు అభినందించారు. సందర్శకులు పక్షుల కోసం వరి కంకులు, మట్టితో చేసిన మూకుళ్లు విరివిగా కొనుగోలు చేశారు.

సబ్బం హరి ఆశయాలను ముందుకు తీసుకువెళతా

» జాతీయ మాజీ క్రికెటర్ కమలాకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న కమలాకరరావు

అక్కయ్యపాలెం, జనవరి 7: దివంగత నేత సబ్బం హరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఆయన ఆశయాలకు ఏ పార్టీ విలువ ఇస్తుందో ఆ పార్టీలో చేరతానని జాతీయ మాజీ క్రికెటర్ జీవీవీఎస్ కమలాకరరావు అన్నారు. డైమండ్‌పార్కు సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల కోసం విశాఖలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. కుల ప్రాతిపదికన కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టు కుని రానున్న ఎన్నికల్లో మంచి వ్యక్తిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సబ్బం హరి కోరుకున్నట్లుగా విశాఖలో మంచి నాయకత్వాన్ని తీసుకువస్తామని, మరో పది రోజుల్లో ఏ పార్టీలో చేరబోయేది వెల్లడిస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన కూడా ఉందన్నారు. 2014లో తాను జై సమైక్యాంధ్ర పార్టీ నుంచి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ప్రజలెంతో ఆదరించారని పేర్కొన్నారు.

రిక్కీ బుయ్ అజేయ సెంచరీ

» రసవత్తరంగా సాగుతున్న రంజీ క్రికెట్ మ్యాచ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 7: ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బెంగాల్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్ మూడో రోజు ఆటలో ఆంధ్ర మిడిలార్డర్ రిక్కీ బుయ్ అజేయ సెంచరీతో (107 నాటౌట్) అదుకున్నాడు. 109/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర ఆరు వికెట్లకు 339 పరుగులు చేసింది. అశ్విన్ హెబ్బర్ డకౌటై నిరాశపరిచినా కెప్టెన్ హనుమాన్ విహారి అర్ధ సెంచరీతో (51), కె.నితీశ్‌కుమార్ రెడ్డి (30), షోయబ్ మహ్మద్‌ఖాన్ (31) రాణించడంతో బెంగాల్ చేసిన తొలి ఇన్నింగ్స్ స్కోరుపై (409) ఆధిక్యత సాధించే దిశగా వెళుతోంది. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ దీప్, మహ్మద్ కైఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా ఇషాన్, ప్రదిప్త తలో వికెట్ తీశారు. సోమవారం చివరి రోజు ఆట మిగిలున్న నేపథ్యంలో మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలున్నాయి.

బృందావన్ పార్కులో ముగ్గుల పోటీలు

మురళీనగర్, జనవరి 7: జీవీఎంసీ 50వ వార్డు పరిధిలోని మురళీనగర్ బృందావన్ పార్కులో ఆదివారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. పార్కు కమిటీ కార్యదర్శి మురళీ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 40 మంది రంగవల్లికలను వేశారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా డాక్టర్ జయంతి వ్యవహరించారు. ప్రథమ బహుమతికి సంతోషిని, ద్వితీయానికి రజని, తృతీయ బహుమతికి సంధ్య ఎంపికయ్యారు. బేబీ లియా వేసిన ముగ్గుకు కన్సొలేషన్ బహుమతి అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పర్వదినాన విజేతలకు బహుమతులు అందజేస్తామని పార్కు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

తెలుగు ఉపాధ్యాయుడికి పతకం, ప్రశంసా పత్రం

అక్కయ్యపాలెం, జనవరి 7: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన తెలుగు మహా సభల్లో 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావుకు పతకం, ప్రశంసాపత్రం లభించింది. ఈ నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరం గైట్ కాలేజీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహా సభల్లో ధర్మారావు పాల్గొని తన ప్రతిభను చూపి పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీ నరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు


పతకం, ప్రశంసా పత్రం అందిస్తున్న నిర్వాహకులు

సెయింట్ పీటర్స్ పూర్వ విద్యార్థుల 'స్నేహ బంధం'



గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

మురళీనగర్, జనవరి 7: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ స్కూల్ 1986-87 పూర్వ విద్యార్థులంతా ఆదివారం నగరంలోని ఓ హోటల్లో 'స్నేహ బంధం' కార్యక్రమం ద్వారా కలుసుకుని ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల్లో ఒకరైన నగర మాజీ పోలీస్ కమిషనర్ చిరువోలు శ్రీకాంత్ మాట్లాడుతూ సెయింట్ పీటర్స్ స్కూల్ తనకు క్రమశిక్షణను, మంచి మిత్రులను అందించిందన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు విదేశాల్లో స్థిరపడిన వారంతా ఈ కార్యక్రమానికి హాజరై ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఘనంగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ స్వర్ణోత్సవం


సర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సీతమ్మధార, జనవరి 7: ఇక్కడి ఎస్ఎఫ్ఎస్ స్కూల్ స్వర్ణోత్సవాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ స్కూల్‌లో విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ వేడుకలకు హాజరై సందడి చేశారు. 1987 బ్యాచ్ విద్యార్థులైతే నృత్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా స్కూల్‌కు విచ్చేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు, ఫాదర్‌లు, పాఠశాల సిబ్బందిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు డాక్టర్ ఎస్.మురళీధర్, జయచంద్ర వర్మ, పి.అనిల్‌కుమార్, శ్రీధర్ బిత్ర, పీవీఎస్‌వీ ప్రసాద్, రాఘవ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

డాబాగార్డెన్స్, జనవరి 7 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు పాలనతోనే సాధ్యమని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆదివారం 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలకు చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు సారిపల్లి మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి ఫణికుమారి, సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఇకియాజ్, బూత్ అధ్యక్షురాలు సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


స్థానికులకు కరపత్రాలిస్తున్న గండి బాబ్జీ

కనక మహాలక్ష్మికి బంగారు నక్లెస్ బహూకరణ

జగదాంబ కూడలి, జనవరి 7: కనక మహాలక్ష్మి అమ్మవారికి తుమ్మిడి బ్రదర్స్ రూ. 1.16 లక్షల విలువ చేసే బంగారు నక్లెస్‌ను ఆదివారం బహూకరించారు. జగదంబా జంక్షన్‌లోని తుమ్మిడి బ్రదర్స్ వస్త్ర దుకాణం 15వ వార్షికోత్సవం పురస్క రించుకొని అభరణాన్ని అందజేశామని తుమ్మిడి శ్రీనివాస్, రామ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శిరీష, అధికారులు పాల్గొన్నారు.


ఈఓకు ఆభరణాన్ని అందిస్తున్న తుమ్మిడి బ్రదర్స్

పౌర గ్రంథాలయంలో మియావాకీ స్టోరీ టైమ్

సీతమ్మధార, జనవరి 7: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా ఆదివారం మియావాకీ స్టోరీ టైమ్‌ను నిర్వహించాయి. ఆర్ట్, క్రాఫ్ట్‌ను రెండు విభాగాలుగా విభజించి మొదటి సెషన్‌లో ఒకటి నుంచి నాలుగో తరగతి విద్యార్థులకు కాగితంతో బొమ్మలను తయారు చేయించారు. రెండో సెషన్‌లో ఐదు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులతో సృజనాత్మకంగా నేమ్ ప్లేట్స్‌ను రూపొందించారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విశ్రాంత డీఎస్పీ వెంకటాద్రి మృతి


చాపరాల వెంకటాద్రి (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జనవరి 7: విశ్రాంత డీఎస్‌పీ చాపరాల వెంకటాద్రి (81) ఆదివారం మృతిచెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భౌతికకాయాన్ని పిఠాపురం కాలనీలోని స్వగృ హానికి చేర్చారు. మంగళవారం అంత్యక్రియలు జరపనున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన వెంకటాద్రి బీకాం చదువుకున్నారు. 1965లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెంలో మొదట బాధ్యతలు చేపట్టి విజయనగరం, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, పామర్రు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. తరువాత సీఐగా పదోన్నతి పొంది రామచంద్రాపురం, ఏసీపీగా పదోన్నతి పొంది (1992లో) విశాఖ సిటీ ట్రాఫిక్ విభాగంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం లా అండ్ ఆర్డర్, హోమ్ గార్డు విభాగాల్లో పనిచేశారు. 1997 చివరలో హైదరాబాద్ సిటీకి బదిలీ అయ్యారు. 2000లో అక్కడే ఉద్యోగ విరమణ చేశారు.

మళ్లీ దొడ్డిదారి బదిలీలు

... 5వ పేజీ తరువాయి

బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న ఉపాధ్యాయులను ఈ ఖాళీల్లో నియమించాలని యోచిస్తున్నారు. ఇదే అదనుగా ఇక్కడి విద్యా శాఖ సిబ్బందిలో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొమ్ము చేసుకుంటున్న సహాయకుడు

అడ్డగోలు బదిలీలకు ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధి వద్ద ఓ సహాయకుడు చక్రం తిప్పారనే ప్రచారం జరుగుతోంది. బదిలీ కోసం తన వద్దకు వచ్చే టీచర్ల నుంచి ఇతను భారీగానే డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. రైల్వే న్యూకాలనీలో ఉంటున్న ఈ వ్యక్తి ఉత్తరాంధ్రలోని విద్యా శాఖ అధికారులతో నిత్యం టచ్‌లో ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. గత ఏడాది జూన్‌లో టీచర్ల బదిలీలు ముగిసిన తరువాత జూలై, ఆగస్టులో అడ్డదారి బదిలీల పేరిట భారీగా ప్రభుత్వ ఆర్డర్లు తెచ్చిన ఇతను, టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కాగా గత ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి చాలామంది విశాఖ, అనకాపల్లి చుట్టూ ఉన్న పాఠశాలలకు రాగా, అదే సంఖ్యలో నగరం, మైదానంలో పనిచేస్తున్న టీచర్లు ఏజెన్సీకి వెళ్లారు. మన్యంలో పనిచేయడానికి ఇష్టపడని వారు డబ్బులు వెచ్చించి మరీ మైదానంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో నగర పరిసరాల్లోకి వచ్చిన ఏజెన్సీ టీచర్లలో కొందరు ఇక్కడ ఇమడలేక సొంత మండలాలకు వెళ్లేందుకు నిర్ణయించారు. వారిని గుర్తించి, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లోనే పనిచేయాలన్న ఆలోచనతో మరికొందరు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గత నెలలో గాజువాక, పెందుర్తి మండలాల్లో పనిచేసే ఇద్దరు టీచర్లు పరస్పర బదిలీల పేరిట ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇదే దారిలో మరికొందరు టీచర్లున్నారని, వీరందరికీ కీలక ప్రజా ప్రతినిధి సహాయకుడి నుంచి భరోసా లభించిందనే ప్రచారం సాగుతోంది.

గంజాయికి అడ్డాగా నగరం

... 5వ పేజీ తరువాయి

విశాఖ చేర్చుతున్నారు. నగరంలో ఏదో ఒక చోట నిల్వ ఉంచి, అదను చూసుకుని వాహనాలు, రైలు మార్గంలో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరిగి ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తడంతో గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని పోలీసులపై ఒత్తిడి పెంచారు. దీంతో పోలీసులు గతరెండేళ్లుగా నిఘా పెంచారు. 2021లో 221 గంజాయి రవాణా, విక్రయం కేసులు నమోదుచేయగా 547 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 512 మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఆయా కేసుల్లో 2,742 కిలోలు గంజాయిని సీజ్‌చేశారు. 2022లో గంజాయి రవాణా, విక్రయానికి సంబంధించి 255 కేసులు నమోదుకాగా 737 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 636 మందిని రిమాండ్‌కు పంపించారు. ఆయా కేసుల్లో 5,866 కిలోల గంజాయిని సీజ్ చేశారు. 2023లో 230 కేసులు నమోదుచేయగా 886 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 660 మందిని అరెస్టు చేసి 4,650 కిలోల గంజాయి సీజ్ చేశారు. ఇదిలావుండగా పోలీసులు నమోదుచేసిన కేసులు చాలాస్వల్పమని, వాస్తవంగా నగరం మీదుగా గంజాయి రవాణా జరుగుతున్నదానిలో వీటి సంఖ్య పదిశాతం లోపే ఉంటుందని పోలీసులే పేర్కొంటున్నారు.

తనిఖీలు ముమ్మరం: సీపీ

ఏటా గంజాయి కేసుల సంఖ్య పెరుగుతుండడంపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ వద్ద ప్రస్తావించగా గంజాయి రవాణాపై నిఘా పెంచడంతో కేసుల సంఖ్య పెరుగుతోందన్నారు. పట్టుబడితే కేసు నమోదుచేసి వదిలేయకుండా పూర్తిచైన్‌ను గుర్తించి అందరిపైనా కేసులు నమోదుచేస్తున్నామన్నారు. దీనివల్ల నిందితుల సంఖ్య కూడా పెరుగుతోందని వివరించారు. నగరంలో గంజాయి కట్టడికి కొత్తగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాల తనఖీలను ముమ్మరం చేస్తామన్నారు.

ఆక్రమణలో గిడిజాల కొండ

... 5వ పేజీ తరువాయి

జరుగుతుండడం వీరికి కలిసి వచ్చింది. గతంలో ప్రైవేటు బీమా/చిట్‌ఫండ్ ఏజెంటుగా పనిచేసిన ఓ వ్యక్తి అధికార పార్టీ ముఖ్యనేతల వద్ద పరిచయాలు పెంచుకుని, కొండవాలులో ఆక్రమించిన స్థలాన్ని సెంటు రూ. రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల చొప్పున స్థలాలు విక్రయిస్తున్నట్టు సమాచారం. దీంతో గతంలో ఇక్కడి స్థలాన్ని ఆక్రమించుకున్న వారు, తోటలు పెంచుతున్న వారు కూడా తమ ఆధీనంలోని స్థలాలను ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మేస్తున్నారు. వీరికి ఓ మండల ప్రజాప్రతినిధి తోడయ్యారన్న ఆరోపణలున్నాయి.

జోరుగా ఇళ్ల నిర్మాణం

కొండవాలులో స్థలాలు కొనుగోలుచేసిన వారంతా పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. రెండంతస్తులు, విశాలమైన ఇళ్లను నిర్మాణాలు పూర్తిచేయగా మరికొందరు పునాదులు వేస్తున్నారు. నిర్మాణాల్లో ఇబ్బందులు రాకుండా తహసీల్దారు కార్యాలయం, గ్రామ సచివాలయంలోని సిబ్బందికి, అధికార పార్టీ నేతలకు భారీగా మామూళ్లు అందజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సగటున ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షల చొప్పున మామూళ్లు అందుతుండడంతో ప్రభుత్వ యంత్రాంగం ఆక్రమణల వైపు కన్నెత్తి చూడడం లేదని చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

నిర్మాణదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము నుంచి గిడిజాలలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు కూడా ఖర్చు చేస్తున్నారని స్థానిక నేతలే చెప్పుకుంటున్నారు. కాగా గిడిజాలలో సుమారు వెయ్యి ఇళ్లకు సంబంధించి జగనన్న కాలనీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దానికి ఆనుకుని ఉన్న కొండను ఆక్రమించుకుని, ఇళ్లు నిర్మిస్తుండడంతో పెద్దగా ఎవరు పట్టించుకోరన్న ధీమాతో ఆక్రమణదారులున్నారు. అయితే అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా సందర్శించి వెళ్లిపోవడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇప్పటివరకు సుమారు రూ. 20 కోట్ల విలువైన కొండ వాలు ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే కొండ కనుమరుగై పెద్దకాలనీ వెలుస్తుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగుల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

» మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్

» రాష్ట్రస్థాయి మున్సిపల్ ఉద్యోగుల ప్రథమ మహాసభ

సిరిపురం, జనవరి 7: ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగుల పక్షపాతి అని మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మునిసిపల్ ఉద్యోగుల ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 మున్సిపల్ కార్పొరేషన్లలోని అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగమే ఉద్యోగులని, వారి డిమాండ్లు పరిష్కరించేందుకు సబ్ కమిటీ కృషిచేస్తుందన్నారు. మునిసిపల్ విభాగంలో కొన్ని కేటగిరీలైన పారిశుధ్యం, అండర్ గ్రౌండ్ తదితర విభాగాలకు చెందిన అవుట్ సోర్సింగ్ కార్మికులతో పోల్చుకోవద్దని, వారు చేసిన పని ఎంతో గొప్పదన్నారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సుమారు 11 అంశాలను మంత్రులకు చదివి వినిపించారు. ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరావు ఉద్యోగుల ఐక్యతతో హక్కులను సాధించుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ దొప్పలపూడి, ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, వీవీ వామనరావు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి సిరిపురం గురజాడ వరకు ర్యాలీ నిర్వహించారు.


వేదికపై మంత్రులు బొత్స, సురేశ్, అసోసియేషన్ ప్రతినిధులు

గ్రీన్ పార్కులో హ్యాండ్ టూ హ్యాండ్ ఎగ్జిబిషన్

మహారాణిపేట, జనవరి 7: నగరంలోని గ్రీన్ పార్కు హోటల్‌లో సంక్రాంతి పండగ పురస్కరించుకుని హ్యాండ్ టూ హ్యాండ్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ ప్రారంభమయింది. నిర్వాహకులు విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలతో ఎక్స్ పో నిర్వహిస్తున్నారు. ఈనెల 10 వరకు ఈ ఎక్స్‌పో జరగనుంది. ఇందులో మహిళలను ఆకట్టుకునే వివిధ రకాల చీరలు, సల్వార్ టాప్స్, లెనిన్ వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉంచారు. అలాగే ప్రాచీనతను ప్రతిబింబించే పోచంపల్లి కళంకారీ చీరలు, కోల్‌కత్తా బాగల్పూరీ ప్రింట్లు, లక్నో షిఫాన్ బనారెస్ సిల్క్ చీరలు, వెంకటగిరి, ఉప్పాడ చీరలు, బెడ్ షీట్లు కూడా అందుబాటులో ఉంచారు.


ఎక్స్‌పోలో వివిధ రకాల చీరల ప్రదర్శన

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఒమ్మి సన్యాసిరావు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా తూర్పు నియోజకవర్గానికి చెందిన ఒమ్మి సన్యాసిరావు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరిలోవ ప్రాంతానికి చెందిన సన్యాసిరావు గతంలో కార్పొరేటరుగా, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, జనవరి 7 : సింహాచలం దేవస్థానం ఉపాలయం పద్మావతి, అలిమేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనల తరువాత సేవాకాలం జరిపారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ఆండాళ్ అమ్మవారి అలంకరణలో తీర్చిదిద్దిన వేద బ్రాహ్మణులు ఆశక్తులకు. అనంతరం తిరుప్పావైలోని 22వ పాశురాన్ని భక్తులతో కలిసి అర్చకులు విన్నవం చేశారు.

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, జనవరి 7 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ తులసీ దళాలతో అర్చనలు చేశారు.

ముగిసిన గ్రీన్ డేల్ ఫెస్ట్

మధురవాడ, జనవరి 7 : జీవీఎంసీ ఏడో వార్డులోని లా కళాశాల సమీపంలో ఉన్న గ్రీన్ డేల్ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. ఉత్సవంలో భాగంగా విద్యార్థులకు పలు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల చైర్మన్ ఎస్వీ రవీంద్ర బహుమతులు అందించారు.

అడివివరంలో పోలీసు గస్తీ

సింహాచలం, జనవరి 7 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 98వ వార్డు శివారు పాత అడివివరం కూడలిలో ఆదివారం నుంచి పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గోపాలపట్నం శాంతి భద్రతల సీఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా మద్యం, డబ్బు, గంజాయి రవాణా నిలువరించడమే లక్ష్యంగా గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ మూడు షిఫ్ట్‌ల్లో ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుల్ నిర్విరామంగా గస్తీ నిర్వహిస్తారని చెప్పారు.

చినగదిలిలో విద్యార్థుల ధర్నా

ఆరిలోవ, జనవరి 7 : చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ పిజి వసతి గృహం విద్యార్థులు ఆదివారం హాస్టల్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహంలో 159 మంది ఉంటున్నామని, కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు.

గర్భిణిలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాక్షినగర్, జనవరి 7 : జోడుగుళ్లపాలెంలో గర్భిణిలకు రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పెరల్ సిటీ, ప్రేరణ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం న్యూట్రీషియన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ పెరల్ సిటీ అధ్యక్షుడు కిషోర్ చౌహన్, కార్యదర్శి త్రిలోక్ జైన్, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జోనల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం

భీమునిపట్నం, జనవరి 7 : జీవీఎంసీ జోన్ వన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. జడ్సీ రాము ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మధురవాడ, జనవరి 7 : మధురవాడ శిల్పారామంలో వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నగరానికి చెందిన వారాహి మాధవీలత అకాడమీ కళాకారులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. ఎస్. పరమేశ్వరి నృత్య దర్శకత్వంలో కళాకారులు గీతాన్సి, హైమ, రమ్య, దీక్షిత, జోషి నృత్యాలు చేశారు.

సినిమా గైడ్

● **డెవిల్** : జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
● **బబుల్ గమ్** : శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **సలార్** : మెలోడీ, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లలిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరామలక్ష్మి (తగరపువలస)
● **పిండం** : మోహిని (గాజువాక)
● **ఆక్వామెన్** : సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **హాయ్ నాన్న** : మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస).

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 60, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 56, అనపకాయలు 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 20, క్యారెట్ 48, దొండకాయలు 32, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాత) 110, బరబటి 52, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్ద) 230, కొబ్బరికాయ (పెద్ద) 24, బీన్స్ (స్పెషల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 54, కీరదోస 20, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్ద) 15, చేమదుంపలు 54, చిలగడదుంపలు 24 , కంద 54, దేమదు పెండలం 40, కొండకసి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్డు (నెక్) (వంద - రూ.ల్లో)

విశాఖపట్నం	625
విజయవాడ	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	70
ఫారం ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 4 లో..

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, జనవరి 7 : వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించబోయే సంక్షేమ పథకాలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించి, రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, బోర రవికిరణ్, సీహెచ్ గోవింద్, నరేంద్ర, కె. మహేష్, కర్రి గౌరీ, జనసేన మహిళా అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు. అలాగే 16వ వార్డు ఐనకోటలో టీడీపీ తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మురగడ వాసు, అధ్యక్షుడు గోవు, జి. అప్పన్న, ఐటీడీపీ ఇన్‌చార్జి పల్లా బాబు పాల్గొన్నారు.



సింహాద్రిపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఓటరు నమోదుకు విశేష స్పందన

ఆరిలోవ : పెదగదిలి జంక్షన్‌లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఓటరు నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. జగన్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, గాడి సత్యం, నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు





జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ భానుప్రకాష్ శ్రీవాస్తవ్

సింహాచలం, జనవరి 7 : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఉదయం జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ భానుప్రకాష్ శ్రీవాస్తవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ప్రముఖులు గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా అనంతుని నవనీతోత్సవం



నవనీత అలంకరణలో కుంభీమాధవస్వామి



మంత్రి అమర్‌నాథ్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పద్మనాభం, జనవరి 7 : పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బహుళ ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం నవనీతోత్సవం ఘనంగా నిర్వహించారు. కుంభీమాధవస్వామి మూలవిరాట్టుకు ముందుగా పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం స్వామివారిని వెన్నతో అలంకరించారు. ముందుగా నిత్యోత్సవాల్లో భాగంగా నగర సంకీర్తన, గోదా, రంగనాథులకు విశేష అర్చనలు చేసి బేడా సేవ, నామ సంకీర్తన నిర్వహించారు. నవనీత అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. అలాగే మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు అనంతుని చిత్రపటాన్ని బహూకరించారు.



మత్స్యకారులు బహూకరించిన వల, బుంగలతో లక్ష్మణ్, పురందేశ్వరి

జగన్ బీసీ వ్యతిరేకి

» ఓట్ల కోసమే ఉచిత పథకాలు
» ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్
» నగరంలో బీజేపీ బీసీ సామాజిక చైతన్య సభ

ఎంవీపీ కాలనీ, జనవరి 7 : రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బీసీలను అణగదొక్కుతారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో ఆదివారం సాయంత్రం బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మాత్రమే బీసీలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో తూర్పు కాపు, శిష్టకరణ, కళింగ, కోమటి, అరవ కులాలు తమను కేంద్ర జాబితాలో చేర్చాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా, బీసీ వ్యతిరేక పార్టీలు పట్టించుకోలేదని, త్వరలోనే ఈ కులాలు కేంద్ర జాబితాలో చేరుతాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్ కూడా బీసీలకు వ్యతిరేకి అన్నారు. ఓట్ల కోసం ఉచిత పథకాలు పెట్టారని ఆరోపించారు. ఎన్టీఆర్ పుణ్యమా అని ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, దేవేందర్ గౌడ్ వంటివారు ఉన్నత స్థానాల్లో కనిపించారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ బీసీ కులాల అభివృద్ధి కోసం పరితపించే పార్టీ బీజేపీ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఒక్కడి బీసీ కమిషన్‌కు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఓబీసీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, నాయకులు పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర, కొత్తపల్లి గీత, గోపి శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, కాశీవిశ్వనాథరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లింగ భైరవి దివ్య పూజ

ఎంవీపీ కాలనీ, జనవరి 7 : ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో లింగ భైరవి దివ్య పూజ ఆదివారం నిర్వహించారు. ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోయంబత్తూర్ ఆశ్రమం నుంచి వచ్చిన 18 మంది శివాంగ్ సాధకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



విద్యార్థుల మల్ల కంభ ప్రదర్శన



బైక్‌పై విద్యార్థి సాహసం



అబ్బురపరిచిన విన్యాసాలు

ఆనందపురం, జనవరి 7 : గుడిలోవలో విజ్ఞాన్ విహార స్కూల్ 44వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆదివారం నిర్వహించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బాలురతో సమానంగా బాలికలు కూడా పలు సాహసాలు చేసి ఔరా అనిపించారు. ముఖ్యంగా మోటారు సైకిల్‌పై బాలికలు చేసిన విన్యాసాలు గగుర్పాటు కలిగించాయి. పదో తరగతి విద్యార్థినులు పి. దేవీ ప్రశాంతి, పి. విద్యాధరి, ఏ. సావిత్రి, అలేఖ్య జైన్ నడుపుతూ చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. అలాగే మల్ల కంభంపై చేసిన ప్రదర్శనలు పలువుర్ని ఆశ్చర్యపరిచాయి. మోటారు సైకిల్‌పై అగ్నిగోళం నుంచి పది అడుగుల ఎత్తు నుంచి చేసిన జంప్ విజ్ఞాన్ విహార విద్యార్థుల ప్రత్యేకతను నిరూపించింది. మరో విద్యార్థి 30 అడుగుల ఎత్తు నుంచి ట్యూబ్ లైట్లు పగలగొడుతూ చేసిన విన్యాసం,మరోకరు మోటారు సైకిల్‌పై 20 అడుగుల ఎత్తు నుంచి చేసిన విన్యాసం ఔరా అనిపించాయి. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి. సాయి కళ్యాణ చక్రవర్తి, స్టీల్ ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి వైవీ అనురాధ, అవనీష్ భట్నాగర్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి'

విశాలాక్షినగర్, జనవరి 7 : విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలని 9వ వార్డు కార్పొరేటర్ సాదిరెడ్ల స్వాతి అన్నారు. అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (యాక్స్) కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో యాక్స్ డిగ్రీ కళాశాల సెక్రటరీ, రిటైర్డ్ ఐఆర్ఎస్ జంగాలయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పద్మారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. సతీష్ పాల్గొన్నారు.

అడవివరం సొసైటీ మహాజన సభ

సింహాచలం, జనవరి 7 : సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తేనే సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని అడవివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అన్నారు. ఆదివారం బుచ్చవనం గార్డెన్స్‌లో జరిగిన ఆ సంఘం మహాజన సభలో ఆయన మాట్లాడారు. గత ఏడాది డిసెంబరు 31 వరకు ఏమాత్రం బకాయి లేని సభ్యుడికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని మార్చి నెలాఖరువరకు కొనసాగించనున్నట్టు చెప్పారు.ఇప్పటివరకు అమలు చేస్తున్న బంగారు ఆభరణాల రుణాలపై వడ్డీ రేటును 12 శాతం నుంచి 11 శాతానికి తగ్గిస్తున్నట్టు పేర్కొన్నారు. గతేడాది వచ్చిన లాభాల్లో సభ్యులకు షేర్ కేపిటల్‌పై 20 శాతం, త్రిఫ్ట్ డిపాజిట్లపై 8 శాతం డివిడెండ్ రూపంలో ఈనెల 10 నుంచి పంపిణీ చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో పాలక మండలి ఉపాధ్యక్షుడు బుచ్చిబల్లి మహేష్, సభ్యులు గురునారాయణ, ప్రసాదిరెడ్డి, ధర్మరాజు, నాగరాజు, పాలారి సూరిబాబు, ఉంద వెంకటరమణ, కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

'లారీ డ్రైవర్లపై అక్రమ కేసులు తగవు'

ఆనందపురం, జనవరి 7 : లారీ డ్రైవర్లపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని లారీ డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జి. సూర్యనారాయణ, కార్యదర్శి పూడి అప్పారావు అన్నారు. ఆదివారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో వేములవలస కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లారీ డ్రైవర్లపై పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన చట్టాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు అప్పారావు, ఈగల కిరణ్, చిన్నారావు, బి. పైడినాయుడు, కిలారి శ్రీను పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంపై పునరాలోచించాలి

వెంకోజీపాలెం, జనవరి 7 : ఆటో డ్రైవర్ల ఆదాయానికి నష్టం కలిగించే ఉచిత బస్సు ప్రయాణంపై రాజకీయ పార్టీలు పునరాలోచించాలి ఏఐటీయూసీ నాయకుడు పడాల గోవింద్ అన్నారు. ఆదివారం ఆయన ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధి కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటీపడి ప్రజలకు ఉచిత పథకాలు ప్రకటించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఆయనతో పాటు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అద్దూరి శంకర్, నాయకులు ఎస్. మధురెడ్డి, కృష్ణనాయుడు, ఎన్. అప్పలనాయుడు, చిన్న ఉన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా దారుణ చర్య

పద్మనాభం (రూరల్), జనవరి 7 : తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దారుణమని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

టీడీపీ నాయకుడి పాదయాత్ర

కొమ్మాది, జనవరి 7 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవాలని కోరుతూ సెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నాయకుడు అశోక్‌బాబు ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం పీఎంపాలెం చేరుకుంది. ఈమేరకు భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో ఆరో వార్డు నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు గొర్లె గురునాథ్, పోతిన రమణ, రెడ్డి సత్యనారాయణ, కుప్పాల గురునాథ్, కొరగంజి సూరిబాబు, పిళ్లా శ్రీను, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ

కొమ్మాది, జనవరి 7 : మధురవాడ జోన్ శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వతంత్రనగర్‌లో 150 మంది నిరుపేదలకు సంక్రాంతి సందర్భంగా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్, బీవీఎస్ పాత్రో, గోవిందరావు, నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

9న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం, జనవరి 7 : అంతర్జాతీయ 49వ హిందీ దివస్ పురస్కరించుకుని ఈనెల 9న భీమిలి లో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు అదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ వ్యాసరచన, 11.30 నుంచి వక్తృత్వ పోటీలు, అనంతరం చిత్రలేఖనం పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 8వ తరగతి నుంచి పిజి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎండాడ, జనవరి 7 : విజయవాడలో ఈనెల 19న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఎమ్మెల్సీ రవీంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రి బాలరాజు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ విద్యార్థుల ట్రెక్కింగ్

తగరపువలస, జనవరి 7 : సంగివలస ఎన్ఆర్ఐ దంత వైద్య కళాశాల విద్యార్థులు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని లంబసింగిలో ట్రెక్కింగ్ చేపట్టారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారం ట్రెక్కింగ్ చేపట్టినట్టు ప్రిన్సిపాల్ వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డా. శివకుమార్, 50 మంది వలంటీర్లు పాల్గొన్నారు.



వార్డులో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న చిన్నికుమారి

రెండో వార్డులోని సమస్యలు పరిష్కరించాలి

తగరపువలస, జనవరి 7 : జీవీఎంసీ రెండో వార్డులోని సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు కార్పొరేటర్ జి. చిన్నికుమారి కోరారు. ఆదివారం ఆమె రాయిపాలెం, నిమ్మవానిపేట, వలందపేట, ఎరుకానిపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమ్మె వల్ల గ్రామాల్లో చెత్త పేరుకుపోయి ఇబ్బందికరంగా ఉందన్నారు. డస్ట్‌బిన్లు చెత్తతో పూర్తిగా నిండిపోయాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పలనాయుడు, జీరు సత్యం, నీలకంఠం, మాజీ కౌన్సిలర్ పిల్ల ఎర్రయ్యరెడ్డి, అప్పలరెడ్డి, సరగడ గోపి, ఈశ్వరరావు, సూరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల దీక్షలకు నేతల సంఘీభావం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మూర్తి

తగరపువలస, జనవరి 7 :స్థానిక తాతా కూడలిలో నిరసన దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు టీడీపీ, జనసేన నాయకులు మద్దతు ప్రకటించారు. ఆదివారం వారు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా సమ్మెను నిషేధించడం, జీతాల్లో కోత విధించడం వంటివి సమంజసం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో 1, 2 వార్డుల టీడీపీ అధ్యక్షులు సూరిబాబు, నీలకంఠం, మాజీ కౌన్సిలర్ నరసింగరావు, జనసేన 1వ వార్డు అధ్యక్షుడు పి. బసవేశ్వర పాల్గొన్నారు.

స్కూబా డైవర్ల సేవలు స్ఫూర్తిదాయకం : కమిషనర్

సాగర్‌నగర్, జనవరి 7 : స్కూబా డైవర్లు సముద్రంలో వ్యర్థాలను వెలికితీసి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. ఆదివారం జోన్ 2లోని రుషికొండ తీరంలో స్కూబా డైవర్ల సముద్రంలో వ్యర్థాలను వెలికితీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైవింగ్ ద్వారా సముద్రంలో నుంచి సుమారు మూడు టన్నుల ప్లాస్టిక్, ఫిష్ వ్యర్థాలను ప్లాటీపస్ ఆర్గనైజేషన్ వెలికితీసిందన్నారు. నగరంలోని తీర ప్రాంతాల్లో స్కూబా డైవింగ్ బృందాల సహకారంతో సముద్రంలోని వ్యర్థాలను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏకో వైజాగ్ కార్యక్రమాల నోడల్ ఆఫీసర్, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి డి. లక్ష్మి, జడ్సీ కనకమహాలక్ష్మి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎస్. కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాలు ఊరేగింపు

మధురవాడ, జనవరి 7 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పిల్లకోమటివానిపాలెంలో నిర్మించిన రామాలయంలో ప్రతిష్ఠించడానికి ఆదివారం సీతారాముల విగ్రహాలను తీసుకువచ్చారు. బీచ్ పాలెం నుంచి గ్రామంలోకి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, పోతిన బాలాజీ, నాగోతి నర్సినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

9న హిందూ డిక్లరేషన్‌పై సమావేశం

భీమునిపట్నం (రూరల్), జనవరి 7 : హిందూ డిక్లరేషన్ డిమాండ్‌తో ఈనెల 9న దసపల్లా హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు హిందూ ధార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు శివాజీ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు.

రుషికొండ బీచ్‌కు సందర్శకుల తాకిడి



సందర్శకులతో సందడిగా ఉన్న తీరం

సాగర్‌నగర్, జనవరి 7 : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది.నగరం నలుమూలలతో పాటు పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, హైదరాబాద్ నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. చలిని సైతం లెక్కచేయకుండా సముద్ర స్నానాలు చేస్తూ.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం పలువురు సాగర్‌నగర్‌లో ఇస్కాన్ మందిరాన్ని, రుషికొండ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

జూపార్కు కిటకిట

ఆరిలోవ : నగరంలోని జూపార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సుమారు 3630 మంది పర్యాటకులు జూను సందర్శించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

భీమునిపట్నం, జనవరి 7 : పట్టణంలోని ది సన్ పాఠశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ లక్ష్మీలావణ్య దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టను విద్యార్థులకు వివరించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జనవరి 7 : మండలంలోని సింగనబంద పంచాయతీలో అయోధ్య నుంచి వచ్చిన భద్రాచల ఆక్షింతలను ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని సింగనబంద, చిన్నిపేట, ఎస్సీ కాలనీల్లో మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జీవీ నారాయణ, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, తాతినాయుడు, కనకల అప్పలరాజు, కరుపుక్క వాసు, మాసాడ లక్ష్మణరావు, వెంకటరావు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలో అయోధ్య రాముడి పూజాక్షితలను ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఎంపీపీ రాంబాబు, ధర్మాశాస్తా పీఠం కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 1200 గృహాలకు అక్షితలను అందజేశారు.

యువత ఆలోచనలే దేశ ప్రగతికి సోపానాలు

- సినీ రచయిత బుర్రా సాయి మాధవ్



సాయి మాధవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, జనవరి 7 : యువత ఆలోచనలే దేశ ప్రగతికి సోపానాలు అని తెలుగు సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ అన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ (యువజనోత్సవం)లో ఆదివారం ఆయన మాట్లాడారు. యువత తమ లక్ష్యాన్ని, మార్గదర్శకాల్ని మరువరాదన్నారు. అనంతరం సాయి మాధవ్‌ను ఏయూ అల్యూమినీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. మనీష్ జంగ సత్కరించారు. కాగా ఉత్సాహభరిత వాతావరణంలో యూత్ ఫెస్టివల్ జరుగుతోంది. ఆదివారం వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్టర్న్ వోకల్ సోలో, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలు, మధ్యాహ్నం భారతీయ బృంద నృత్యాలు, కొల్లాజ్, వెస్టర్న్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, రంగోలి పోటీలు నిర్వహించారు.